“నే చెప్పినట్లు చెయ్యి.”

డ్రయివర్ అయిష్టంగానే తన కారుని వెనక్కి పోనిచ్చాడు. ముందు కారు డ్రయివర్ తన కారుని ముందుకి తెచ్చి ఈ కారు పక్కన ఆపి అరిచాడు.

“అలా దారికి రా.”

వెంటనే సన్యాసి కారుదిగి ఆ డ్రయివర్ దగ్గరకి వెళ్ళి నవ్వుతూ చెప్పాడు.

“నీకు కలిగిన ఇబ్బందికి సారీ. నీకు దారి ఇచ్చిన ఆనందం మాకు దక్కింది. నిజానికి ఆ ఆనందాన్ని నీకు ఇద్దామని ఆగాం కాని నీ బలహీనతని కొద్దిగా ఆలస్యంగా గుర్తించాం.”

## 117. తరంగాల తతంగం

“స్వామీ. వైబ్రేషన్స్ అని ఆధ్యాత్మిక ప్రపంచంలో ఎక్కువగా వింటూంటాను. అవి ఏమిటి?” ఓ సాధకుడు ఓ తాత్విక వేత్తని అడిగాడు.

“ఈ కథ విను. ఓ రాజు ఓ సారి ఓ గంధం కట్టెలు అమ్మే దుకాణం పక్క నించి వెళుతూంటే ఆ దుకాణం యజమాని మీద అకస్మాత్తుగా ఆయనకి కోపం వచ్చింది. అందుకు ఆశ్చర్యం కలిగిందాయనకి. మంత్రిని పిలిచి ఆ విషయం చెప్పాడు. మంత్రికి కూడా ఆశ్చర్యం వేసింది.

“నేనా దుకాణానికి వెళ్ళి అందుకు కారణం తెలుసుకోగలనేమో ప్రయత్నిస్తాను.” మంత్రి రాజుకి చెప్పాడు.

సాయంత్రం మంత్రి వచ్చి రాజుతో చెప్పాడు.

“రాజా! నేను మధ్యాహ్నం ఆ గంధం కట్టెలమ్మే వాడి దుకాణానికి వెళ్ళి దాని యజమానిని అనేక ప్రశ్నలు వేసాను. నాకు సంగతి కొంతదాకా బోధ పడింది. అతను వ్యాపారం సరిగ్గా లేక ఆర్థిక ఇబ్బందుల్లో వున్నాడు. మీరు ఎప్పుడు పోతారా అని ఎదురు చూస్తున్నాడు. మీరు పోతే మీ చితి కోసం చాలా గంధపు కట్టెలని అతని దుకాణం నించి కొంటాం కాబట్టి అతని ఆర్థిక పరిస్థితి బాగుపడుతుంది అన్న ఆలోచనతో దేవుడ్ని ప్రార్థిస్తున్నాడు. మీకు అతని మీద అకారణంగా ద్వేషం కలగలేదు.”

రాజు ఆలోచించి కొన్ని బంగారు నాణాలని మంత్రి ద్వారా ఆ వ్యాపారస్థుడికి భవిష్యత్‌లో కొనబోయే సరుకు నిమిత్తం పంపాడు. మర్నాడు రాజు అతని దుకాణం పక్క నించి వెళ్తూంటే రాజుకి ఆ దుకాణం యజమాని మీద స్నేహ భావం కలిగింది. లోపలకి వెళ్ళి రాజు ఆ వ్యాపారస్థుడ్ని అడిగాడు.

"ఇప్పుడు ఏం ఆలోచిస్తున్నావు?"

"మీరు పదికాలాల పాటు చల్లగా వుండాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నాను ప్రభూ." చెప్పాడు అతను.

ఇలా ఇతరుల మనోభావాలు మనకి తెలీకుండానే మన మీద తమ ప్రభావాన్ని చూపిస్తాయి. ఆ మనిషి అక్కడ లేకపోయినా సరే అతని అనుకూల లేదా ప్రతికూల మనోభావాల తరంగాలు ఆ ప్రదేశంలో చాలాకాలం వుంటాయి. ఇందుకే హిమాలయాల్లో అనాదిగా లక్షల మంది ఋషులు చేసిన తపస్సు తాలుకు తరంగాలు అక్కడ వుండి, సాధకులకి అవి ధ్యానంలో మేలు చేస్తాయి. సూక్ష్మమైన రూపంలో మనిషి ఆలోచనా తరంగాలు ఈ ప్రపంచంలో తిరుగుతూనే వుంటాయి. అందుకే హిందువులు 'సర్వే జనాస్సుఖినో భవంతు' అంటూ చేసే ప్రార్థన అనుకూల తరంగాలని సృష్టిస్తాయనే చేస్తారు. ఇలాగే శాంతి మంత్రాలు వల్లె వేయడం వెనక కూడా గల పరమార్థం ఇదే." వివరించాడు గురువు.

## 118. మోక్ష మార్గం

మోక్షాపేక్ష గల ఓ రాజు తన రాజధానికి వచ్చిన ఓ మహనీయుడ్ని తన సభకి సగౌరవంగా ఆహ్వానించాడు. రాజు ఆయన్ని సభా ముఖద్వారం దగ్గర ఎదురై పూర్ణకుంభంతో ఆహ్వానం పలికి సభలోకి వెంట తీసుకెళ్ళాడు. ఆయన్ని సభికుల ఎదుట అడిగాడు.

"మోక్షం పొందే దారి దయచేసి చెప్పండి."

ఐతే ఆ మహనీయుడు రాజు మాటలని వినిపించుకోకుండా సభలోని పరిచారకుల యోగక్షేమాలని విచారించసాగాడు. రాజు తన ప్రశ్నని ఐదారుసార్లు వేసినా ఆయన దాన్ని పట్టించుకోక, సభికులందరిని ఒక్కొక్కర్నే పిలిచి వారితో